# దేవుడు చేసిన మనుషులూ – మనుషులు చేసిన దేవుళ్ళూ

లక్ష్మీదేవి విష్ణుమూర్తి పాదాలు ఒత్తుతూండగా "నారాయణ, నారాయణ" అంటూ నారదుడు ప్రవేశించాడు. లక్ష్మీదేవి చిరునవ్వుతో స్వాగతం పలికింది.

"ఎన్నాళ్ళమ్మా ఇంకా నీకీ కష్టం?" అన్నాడు నారదుడు.

"అదేమిటి? లక్ష్మిని పువ్వుల్లో పెట్టి అపురూపంగా చూసుకుంటున్నా కదా, ఆవిడ ఏం కష్టపడిపోతోందని?" అని అడిగాడు విష్ణుమూర్తి.

"చూశావా అమ్మా ఆయన గడుసుతనం! ఓ వైపు నిన్ను పువ్వు మీద కూర్చోబెట్టి, మరోవైపు నీ సుకుమారమైన చేతులతో తనకాళ్ళు పట్టించుకుంటున్నాడు? ఇంతకన్నా భూలోకంలోని భర్తలు నయం! కాళ్ళు పీకితే 'బి విటమిన్' మాత్రలు వేసుకుంటారు. బానిసత్వం పోవాలని స్త్రీలు పోరాటం సాగిస్తున్నారక్కడ".

నారదుడి చెప్పుడు మాటలు విని లక్ష్మీదేవి ఎక్కడ తిరగబడుతుందోనని లోలోపల భయపడి, "బ్రహ్మచారివి, భార్యాభర్తల మధ్య గొడవలు నీకెందుకయ్యా? అయినా, గిల్లికజ్జా పెట్టడం నీ కలవాటేగా!" అన్నాడు విష్ణుమూర్తి.

"నాకు ఎందుకని ఊరుకోవడం న్యాయమా స్వామీ? అజ్ఞానంలో ఉన్న వారిని మేలుకొలిపి ప్రపంచ జ్ఞానాన్ని కలుగజెయ్యడానికే కదా నా ఈ త్రిలోక సంచారం! మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడదామని వచ్చాను...ఎందుకు లెండి...నా దారిని నేను పోతాను" అని లేచాడు నారదుడు.

"అయ్యో! కూర్చో నారదా, లక్ష్మి చేత ఇంక కాళ్ళు పట్టించుకోనులే. ఈసారి భూలోకం నుంచి వచ్చేటప్పుడు ఆ 'బి విటమిన్" మాత్రలు కాసిని పట్టుకురావడం మరిచిపోకు... ఇంతకీ ఆ ముఖ్య విషయం ఏమిటో చెప్పుమరి' అని బతిమాలాడు విష్ణుమూర్తి.

"స్వామీ, భారతదేశంలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ మధ్య కొంతకాలంగా అక్కడ సినిమాల్లో దేవుళ్ళ వేషాలు వేసిన మహానటులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. పురాణాలన్నా, మహాభారత గాథలన్నా ప్రజలు తెగమోజుపడిపోతున్నారు. అందరూ పోటీలుపడి సినిమాలు తీస్తున్నారు. మీ పేర్లు చెప్పుకుని రాజకీయాలు నడుపుతున్నారు. జనం ఈనాడు ఆ మహానటులనే కొలుస్తున్నారు. మీరు చివరికి ఉత్సవ విగ్రహాలుగా మిగిలి పోవల్సిందే...".

నారదుడి మాటలు విని విష్ణుమూర్తి చింతాక్రాంతుడయ్యాడు. ఇంతలోనే బ్రహ్మదేవుడూ, యమధర్మరాజూ వస్తున్నట్లు కబురొచ్చింది. విష్ణుమూర్తి ఆశ్చర్యపడి లేచి కూర్చున్నాడు. లక్ష్మీదేవి కాస్త వెనక్కి సర్దుకుంది.

"మహావిష్ణూ, ఒక అత్యవసర విషయం చర్చించాలి మీతో" అన్నారు వచ్చిన అతిథి దేవుళ్ళిద్దరూ. విష్ణుమూర్తి నారదుడి వైపు భావగర్భితంగా చూశాడు.

"మనం నారదుడి సమక్షంలోనే చర్చించాలి ప్రభూ. మమ్మల్ని రప్పించినది అతడే కదా" అన్నారు వాళ్ళు

వారిద్దరినీ ఆసీనులనుచేసి, "ఇహ చెప్పండి" అన్నాడు విష్ణుమూర్తి.

"ఈ కలికాలంలో మానవులు మరీ బరితెగించి పోతున్నారు. విష్ణుదేవా" అన్నారు ఇద్దరూ ఒకేసారి.

"ఊఁ, ఉదాహరణకి..." అన్నాడు విష్ణుమూర్తి యమధర్మరాజువైపు తిరిగి.

"మా ధర్మాలను మమ్మల్ని నిర్వర్తించనియ్యడంలేదు. పూర్వం రాక్షసులు ఒక రకంగా పీడించుకుతింటే, ఇప్పుడు మానవులు మరో రకంగా కంటకంగా తయారయ్యారు... చావాల్సిన వ్యక్తుల్ని చావనివ్వకుండా 'గొప్పవారు", "ప్రముఖులు" అంటూ వారికి రకరకాల వైద్యాలు చేసి, వారి జీవితకాలాన్ని మరింత పొడిగిస్తున్నారు. బ్రతికి బట్ట కట్టవలసిన అమాయక శ్రామికుల్ని తిండి, గుడ్డ లేకుండా చేసి, ఏడిపించి చంపుతున్నారు. కొందరిని కక్షతో కాల్చి చంపుతున్నారు. దాంతో ఇక్కడ మా చిట్టాలన్నీ తారుమారవుతున్నాయి. భూలోకం నుంచి వారు పంపించిన వాళ్ళనే మేము తీసుకోవలసి వస్తే, ఇక మా ప్రాధాన్యం ఏముంది? ఈ పదవికి రాజీనామా ఇచ్చి, కృష్ణా, రామా అనుకోవడం మేలనిపిస్తోంది దేవా" అన్నాడు ఆవేదనగా.

"ఏమయ్యా, మీ సమస్యలేమిటి?" అంటూ బ్రహ్మవైపు తిరిగాడు విష్ణుమూర్తి.

"ప్రభూ, ఏం చెప్పను! యముడిగారి సమస్య లాంటిదే నాదీను. పేరుకి సృష్టి కర్తనేగాని, ఈ కలికాలపు మనుషులంతా ఎవరికి వారే సృష్టి కర్తలై విర్రవీగుతున్నారు.

ఇష్టమైతే కంటామంటారు. లేకపోతే పిల్లలు పుట్టకుండా నానామార్గాలూ అవలంబిస్తుంటారు. ఆడపిల్లలు పుట్టాలో, మగ పిల్లలు పుట్టాలో అన్నీ వాళ్ళే నిర్ణయించుకుంటున్నారు. నేను కేవలం 'రబ్బరు స్టాంపుగాణ్ణి' అయిపోయానని నారదుడంటూ ఉంటే నాతల కొట్టేసినట్టుగా ఉంది (అసలే ఓ తలకాయని శివుడు కొట్టేశాడు కదా)" అని తలవంచుకున్నాడు బ్రహ్మ ఇంక చెప్పడం తన వల్ల కాదన్నట్లు.

"ఏమయ్యా నారదా, నా కిలాంటి బాధలేం లేవనా మహాలక్ష్మికి పురెక్కించావు ఇందాక?" అన్నాడు విష్ణుమూర్తి.

"అయ్యో, స్వామీ, మీ ఆసనం క్రింద ఏ ఉపద్రవం ముంచుకొస్తోందో మీరు గమనించడం లేదు పాదాలు ఒత్తుతూంటే కలిగే సుఖంలో, అందుకే లక్ష్మీదేవిని ఇక ఆపమన్నాను. ఇప్పటికే తరుణం మించింది. మన కోసం అవతల మహాశివుడు నిరీక్షిస్తున్నాడు. మనమిప్పుడు అక్కడికి వెళ్ళాలి ప్రభూ, అసలు విషయం అక్కడే ముచ్చటించుకుందాం" అన్నాడు నారదుడు హెచ్చరిస్తున్న స్వరంతో.

అంతా శివసాన్నిధ్యానికి చేరుకున్నారు. శివుడు కోపంతో చిందులు తొక్కుతున్నాడు. ఆలస్యం అయినందువల్లనేమో అనుకుని, నారదుడు చేతులు జోడించి, "శివ శివా, మార్గ మధ్యంలో ఒక 'ఉపగ్రహం' అడ్డొచ్చింది. దాన్ని తప్పించుకు రావడంలో కొంత కాలహరణం జరిగింది. అయినా, ఈ మనుషుల ఆగడాలు అంతకంతకు మితిమీరుతున్నాయి" అన్నాడు.

"అదే నేనూ దేవుళ్ళాడుతున్నాను. వాళ్ళు క్రమంగా మన లోకాలన్నింటినీ ఆక్రమించేట్టున్నారు" అన్నాడు ఆయాసపడుతూ.

శివుడి భుజం మీద చెయ్యి వేసి విష్ణుమూర్తి ఆయన్ని కూర్చోబెట్టాడు. అందరినీ కూర్చోమని సైగచేసి, తనూ కూర్చుంటూ, "మహాశివా, మిమ్మల్ని కూడా ఇబ్బంది పెడుతున్నారా ఈ మానవులు? అదేమిటో సావధానంగా చెప్పండి వింటాం" అన్నాడు.

"సావధానంగా చెప్పడానికీ వినడానికీ సమయం లేదు. మనం త్వరగా ఏదో ఒక పరిష్కారాన్ని యోచించాలి. పూర్వం శివుడాజ్ఞలేనిదే చీమయినా కుట్టదనేవారు. అది ఆనాటి మాట! అదిప్పుడు నీటిమూట అయిపోయింది. నా అధికారం నా చేతిలోంచి ఎప్పుడు జారిపోయిందో నాకే తెలియలేదు. ప్రతిదానికీ ఇప్పుడు ప్రజలంతా ఆ రాజకీయ నాయకులను పట్టుకుంటున్నారు. నేనిక్కడ నుంచి ఆజ్ఞ జారీ చేసినా, అక్కడ ఏ మంత్రికో ఎవరికో లంచం ఇచ్చి నా ఆజ్ఞ అమలు జరక్కుండా చేస్తున్నారు. నేనిక్కడ కైలాసంలో ఎన్ని చిందులు తొక్కి ఏం లాభం? మనం ఏదో ఒకటి చెయ్యాలి తక్షణం. ఇదే మంచి సమయం అనీ, మించితే దొరకదనీ నారదుడు కూడా అంటున్నాడు" అన్నాడు శివుడు.

విష్ణుమూర్తి నారదుడి కేసి తిరిగి 'ఏమంటావు నారదా, ఏం చేస్తే మా పదవులూ, అధికారాలూ యథావిధిగా, నిర్విఘ్నంగా కొనసాగుతాయి చెప్పు? నువ్వు త్రికాలజ్ఞుడివి' అని కాస్త ఉబ్బేశాడు. నారదుడి ఛాతీ అరంగుళం పొంగింది.

"అదే చెప్పబోతున్నాను ప్రభూ. ఆ మధ్య ఒకసారి స్వర్గలోకంలో నేను పాడుకుంటూ వెడుతూండగా ఒక మాజీ ముఖ్యమంత్రి కనిపించి, "అయ్యా, అక్కడ మా దేశంలో రాజకీయాలెలా ఉన్నాయి? కొత్తజాతీయ పార్టీ ఏమైనా వెలిసిందా? జాతీయ సింహాసనాన్ని ప్రముఖ వంశీయులు తప్ప అన్యులెవ్వరూ ఆక్రమించబోవడం లేదుకదా?" అని అడిగాడు.

"అక్కడ ప్రతిపక్షాలు చాలావరకు సంఘటితమై రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి, జాతీయ సింహాసనాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నాయనీ, కానీ, ఆ ప్రతిపక్షాలన్నీ పైకికలిసినట్లు కనిపిస్తున్నా, ఎన్నికలు కాగానే పదవుల కోసం మళ్ళీ తన్నుకోవడం తథ్యం అనీ కొందరు లోకులు అనుకోగా విన్నాననీ చెప్పాను. అప్పుడు ఆ మాజీ ముఖ్యమంత్రి నవ్వి, "నేనప్పుడే చెప్పానా నారదమునీ, ఇందిరమ్మ పార్టీని తప్ప మన ప్రజలు మరో పార్టీని మెచ్చరయ్యా అని. నేనో ఉపన్యాసంలో ఒక ప్రతిపక్ష నాయకుణ్ణి ఉద్దేశించి అన్నాను కూడా వెటకారంగా. ఇయ్యాల "భారతదేశం పార్టీ" అంటున్నరు. మల్ల రేపు స్వర్గం పార్టీ అనబడతరేమో అని'. ఆయన మాటలు విన్నాక నాకో ఆలోచన వచ్చింది. మనమే ఒక 'స్వర్గం పార్టీ' పెట్టి భారతదేశాన్ని స్వయంగా పాలించకూడదా అని. దానికైతే ఇదే మంచి తరుణం. మనం త్వరపడాలి! అన్నాడు నారదుడు.

"మానవుల శుష్క రాజకీయాలతో మనకేం పని నారదా!" అన్నాడు విష్ణుమూర్తి.

"అది కాదు ప్రభూ, మీరంతా కలిసి 'స్వర్గం పార్టీ' అని చెప్పేసి ఒక కొత్త నిజాయితీ పార్టీని నెలకొల్పాలి. ఈ పార్టీలో నిజం దేవుళ్ళూ, దేవ పరివారం సభ్యులుగా ఉంటారు. దేవుళ్ళ వేషాలు వేసుకుని ప్రజల్ని మోసగించే నటులు కాదు. మీరంతా "మేమే నిజం దేవుళ్ళం, మాకు మొక్కితేనే మీకు మేలు" అన్చెప్పి, సినిమా మత్తులోంచి జనాన్ని మేల్కొల్పాలి. స్వర్గం నుంచి మీరే భూలోక ప్రజల్ని పరిపాలించాలి" అని అందరి వైపూ చూసి,

"మీరంతా ఏకగ్రీవంగా విష్ణుమూర్తిని ప్రధాన నాయకుడిగా ఎన్నుకుంటే మంచిది. ఎందుకంటే వేంకటేశ్వరస్వామి పేరు చెబితే ఓట్లు కోట్ల కొద్దీ పడతాయి. అంచేత మీరిప్పుడు ప్రత్యక్షంగా రంగంలోకి దిగాలి. భూలోకంలో మీ శిలా విగ్రహాల ద్వారా పనులు సాధించాలంటే ఇక మీదట సాగదు. మీ ఉనికిని మీరే చాటుకోవాలి. అప్పుడే ఆ విజ్ఞాన శాస్త్రవేత్తలూ, నాస్తికులూ, అంతా మీ దారి కొస్తారు. శైవం, వైష్ణవం, బ్రాహ్మం

అంటూ మీమీ వ్యక్తిగత మనస్పర్థల్ని మరచి, దేవుళ్ళంతా ఏకమైతేనే ఆ కలియుగ మానవుల్ని సక్రమ మార్గంలో పెట్టి భూలోకాన్ని శాంతిమయం చెయ్యగలుగుతారు" అని ముగించాడు నారదుడు.

అందరూ "స్వర్గం పార్టీకి జై", "నారదుడూ జిందాబాద్" అంటూ హర్షధ్వానాలు చేసి, నారదుడికి ధన్యవాదాలు తెలిపారు.

కొంతసేపు తీవ్రంగా చర్చలు జరిపిన మీదట 'స్వర్గలోక దళం' అనే పేరు నిశ్చయించారు. దేవుళ్ళ పార్టీకి ఎన్నికలకు పార్టీచిహ్నంగా వేంకటేశ్వరుని పాదముద్రల్ని వాడుకోవడానికి నిశ్చయించారు. పాదాలు కనిపించగానే వాటిమీద జనం పడిపోవడం ఖాయం అని చెప్పి పాదాలను చిహ్నంగా వాడమని సలహా ఇచ్చినది నారదుడే.

భారతదేశంలో ఎన్నికలు జరిగే రోజు నిశ్చయ మయ్యేందుకు ముందుగానే నారదుడు వెళ్ళి తమ కొత్త పార్టీకి సంబంధించిన విధులన్నిటినీ నిర్వర్తించాడు.

తేది నిశ్చయం కాగానే దేవుళ్ళందరూ సతీ, బంధుమిత్ర సపరివారంగా పుష్పక విమానంలో బయలుదేరి భారత రాజధానీ నగరంలోని విశాలమైన మైదానంలో దిగారు. నారదుడు అప్పటికే అక్కడ దేవుళ్ళ మొదటి బహిరంగ సభని ఏర్పాటుచేశాడు. కానీ, జనం అనుకున్నంతగా రాలేదు. అంతకు కొద్దికాలం క్రితమే స్వతంత్ర దినోత్సవంలో పాల్గొనడానికనీ, తరవాత రామలీలా ప్రదర్శనలు చూడటానికనీ, తరవాత క్రికెట్ మ్యాచ్ చూడటానికనీ జనం చుట్టుపక్కల ఊళ్ళ నుంచి లారీల్లో, బస్సుల్లో వచ్చి వెళ్ళడం మూలాన మళ్ళీ అంత వెంటనే మూటా ముల్లే కట్టుకుని ఉపన్యాసాలు వినడానికి రాలేమన్నారు చాలామంది. "వస్తే ఎంతిస్తారు?" అని అడిగారు కొంతమంది. పోనీ వాళ్ళ మొహాన ఇంత పారేద్దామంటే నారదుడి దగ్గర ఏముంది-బూడిద కూడా లేదాయెను.

స్వర్గం నుంచి నిజం దేవుళ్ళొస్తున్నారు. బహిరంగ సభలో ఉపన్యాసాలు వినడానికి రమ్మంటే నారదుడి మాటల్ని ఎవరూ నమ్మలేదు. పైగా నవ్వారు-ఆ దేవుళ్ళకి కూడా ఉపన్యాసాల పిచ్చి పట్టుకుందా వాళ్ళకి వేరేపని లేదా అని. "అది కాదు. అమ్మలారా, నాయనలారా, వీళ్ళు నిజం దేవుళ్ళు. మీ దేశాన్ని పరిపాలించి మీ మంచిచెడ్డలను విచారిస్తూ ఇక్కడే ఉండిపోవాలన్న సదుద్దేశంతో వస్తున్నార"ని నారదుడు విన్నవించు కున్నాక, సరే, రామలీల చూసినట్లు ఈ లీలకూడా చూద్దామని కొంతమంది గుమిగూడారు. పత్రికా విలేఖరులు సందేహ నివృత్తి చేసుకోవడానికొచ్చారు.

నారదుడు దేవుళ్ళందర్నీ పేరుపేరునా పరిచయం చేశాడు జనానికి-నిజానికి వారిని పరిచయం చెయ్యవలసిన అవసరం లేకపోయినా. అయితే పరిచయం చేసినా

పోల్చుకోలేదు జనం. వారిలో జనానికి గుళ్లలో ఉండే విగ్రహాల పోలికలు గాని, రవివర్మ చిత్రాల్లో దేవుళ్ళ పోలికలు గాని, సినిమాల్లో దేవుళ్ళ వేషాలు వేసే వారి పోలికలు గాని ఎక్కడా కనిపించలేదు. ఇదేదో చవకబారు కంపెనీ సరుకు అయి ఉంటుందని నమ్మి, వాళ్ళ ఉపన్యాసాలు వినిపించుకోకుండా "వీళ్ళ మొహం, వీళ్ళు దేవుళ్ళంటారేమిటి" అంటూ మట్టిలోంచి గులకరాళ్ళు తీసి విసిరారు వేదిక మీదికి. టొమాటోలూ, కోడిగుడ్లూ ధరలు పెరిగిపోయి అందుబాటులో లేక రాళ్ళే విసరవలసి వచ్చింది.

ఆ సభ ఎలాగో పూర్తి అయిందనిపించాక, నారదుడు ఒక సలహా ఇచ్చాడు. ఇక్కడ కాదు, దక్షిణ ప్రాంతానికి వెళ్ళి అటునుంచి నరుక్కురావడం మంచిది. అదీ కాక, అక్కడ స్వామివారి హుండీలో రోజూ చేరేధనమంతా తీసుకుని జనానికి పంచిపెడితే ఓట్లు అక్షింతలు రాలినట్లు రాల్తాయి, పదండి అన్నాడు. పోలో మంటూ బయలుదేరి వెళ్ళారు.

"హుండీలో పడిన ధనం కావాలి" అని అడగ్గానే దేవస్థానం వారు "ససేమిరా...." అన్నారు. "ఈ స్వామి సాక్షాత్తూ ఆ విష్ణుమూర్తి వారే నయ్యా" అని నారదుడు ఎంత మొత్తుకున్నా వినలేదు అధికారులు.

"ఇదసలు ప్రజల సొమ్ము. ఇప్పుడు దేవస్థానం ఆధీనంలో కొచ్చింది. ఎవరి పేరున హుండీలో వేసినా అది దేవస్థానానికే చెందుతుంది. దేవస్థానం కూడా ఆ సొమ్ముని ప్రజా సౌకర్యం కోసమే వినియోగిస్తుంది, కాని ఎన్నికల నిమిత్తం మాత్రం కాదు", అని స్పష్టం చేశారు.

డబ్బుదొరక్కపోవడంతో ఆ దేవుళ్ళకి ఏం చెయ్యాలో అర్థం కాలేదు.

నారదుడి సలహా మేరకు భాగ్యనగరం ప్రవేశించి, వేంకటేశ్వరస్వామి ఆలయానికి దగ్గరలో ఉన్న ప్రజావనంలో బహిరంగ సభ జరుగుతుందని ప్రకటించారు. 'స్వర్గసుర' లభిస్తుందని పత్రికా విలేఖరులను ఊరించారు.

ఇదివరకులాగే అట్టే జనం రాలేదు, కారణాలు వేరైనా. "నిజం దేవుళ్ళయితే ఆళ్ళకి మన కాడి కొచ్చే కర్మేంటి! ఈళ్ళూ నాటకాలరాయుళ్ళే అబ్బో, ఇట్టాంటోళ్ళని శానా మందిని సూసినాం" అంటూచాలా మంది వెళ్ళలేదు. "నిజం దేవుళ్ళయితే, ఆళ్లు తలుసుకుంటే ఓట్లన్నీ డబ్బాలో అదే వర్సగా పడిపోవా! నిజంగా మహాత్యముంటే ఆ స్పీచీ లెందుకంట, పొండెహే! అంటూ కొందరు వెళ్ళలేదు. హుండీ వ్యవహారం అప్పుడే బయటికి పొక్కి "మన చేతుల్లో ఏమైనా పడతాయా పాడా, బస్సు డబ్బులు కూడా దండగ" అంటూ వెళ్ళలేదుకొందరు. అలవాటు చొప్పున ప్రజావనంలోకి వెళ్ళేవాళ్ళూ, మరికొందరు కాలక్షేపానికి వెళ్ళినవాళ్ళూ తప్ప, ప్రత్యేకంగా వెళ్ళిన వాళ్ళు తక్కువే అని చెప్పాలి. పత్రికా విలేఖరులు మాత్రం అంతా వెళ్ళారు.

పత్రికల వాళ్లు ఆ దేవుళ్ళందర్నీ యక్షప్రశ్నలు వేసి, ముప్పు తిప్పలూ పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి, వాళ్ళిచ్చిన స్వర్గసురని మాత్రం వీళ్ళు బాగా లాగించేసి వచ్చేశారు.

మర్నాడు అన్ని పేపర్లలోనూ దేవుళ్ళ బహిరంగ సభ గురించిన రిపోర్టులతో బాటు, సంపాదకీయాలు కూడా వెలువడ్డాయి. ఒకటి రెండు ఛాందస పత్రికలు తప్ప తక్కిన వన్నీ దాదాపు ఈ విధంగా రాశాయి.

"....తామే నిజం దేవుళ్ళమని వీళ్ళు చెప్పుకుంటున్నారు. ఇంత కాలంగా దేవుడున్నాడా లేడా అనే మీమాంసతో మేధావులంతా కొట్టుమిట్టాడారు. ఇప్పుడు వీరు నిజం దేవుళ్ళనే అనుకుందామన్నా సామాన్య ప్రజలకు నమ్మకం కుదరడం లేదు. వారెరుగున్న మహానటుల పోలికలు గాని, కనీసం టాంకు బండ్ మీది ప్రముఖుల విగ్రహాల్లో కనిపించే పోలికగాని ఎక్కడా ఈ నిజం దేవుళ్లలో కానక, తామెరుగున్న దేవుళ్ళనే తప్ప పరాయి దేవుళ్ళ బంగారం లాంటి పలుకులనైనా వినడానికి ఇష్టపడటం లేదు జనం. పోనీ, దీన్ని మూఢ విశ్వాసం అని కొట్టి పారేద్దామంటే, మేధావుల మనఃస్థితి మరోలా ఉంది. దేవుళ్ళ వేషాలు వేసుకుని మహానటులై, ఆ పై మహానాయకులైన వాళ్ళందరూ నకిలీ దేవుళ్ళంటూ మేధావులు తోసి పుచ్చినా, ఈ ప్రస్తుత వ్యవస్థలో ఒక సుగుణం ఉందని భావిస్తున్నారు. దేవుళ్ళ వేషాలు వేసే ఒక మహానటుడు నచ్చకపోతే అతణ్ణి పదవిలోంచి దించేసి, మరో మహానటుణ్ణో, మెగానటుణ్ణో, సూపర్ స్టార్‌నో మహానాయకుడిగా ఎన్నుకోవచ్చు. నిజం దేవుళ్ళు కదా అని ఇప్పుడు ఈ స్వర్గం వారిని ఎన్నుకుని అధికారాన్ని వీరికి అప్పగిస్తే, శాశ్వతంగా మన నెత్తికెక్కి కూర్చునే ప్రమాదముంది. ఇక అప్పుడు మన ప్రజాస్వామ్యం ఏం కావాలి? చెప్పుకోవడానికి మరో దిక్కుండదు.

దేవుళ్ళయితే వారి స్థానంలో వారుండాలి అంతేకాని, ఇలా ప్రజల మధ్య కొచ్చి ప్రజల వ్యవహారాల్లో వేలు పెట్టడం తగదు. వీరి రాక ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని ప్రజలంతా గ్రహించడం శ్రేయస్కరం."

విష్ణుమూర్తికి ఒళ్ళు మండి పోయింది. "ఏడీ, ఆ నారదుడేడీ?" అని రంకె వేశాడు.

"నారాయణ, నారాయణ" అంటూ మహతి టుయ్ టుయ్ లాడిస్తూ వచ్చాడు నారదుడు.

"నారాయణ, నారాయణ" అంటూ నా పరువు తీశావు కదయ్యా' అన్నాడు విష్ణుమూర్తి.

"అలా అనుకుంటే ఎలా స్వామీ! మనుషులు మధ్య మధ్య తమ బరువు సరి చూసుకున్నట్లుగానే, మీరు కూడా మీ పరువు ఏ మాత్రం ఉందో చూసుకోవద్దా?" అన్నాడు నారదుడు.

విష్ణుమూర్తికి పుండు మీద కారం జల్లినట్లయింది.

"అడక్కుండా ఇటువంటి సలహాలింకెప్పుడూ ఇవ్వకు.అసలు నీ సలహా విని నిన్ను నమ్మడం మాదే బుద్ధి తక్కువ" అని చెంపలు వాయించుకున్నాడు విష్ణుమూర్తి.

లక్ష్మీదేవి కిసుక్కున నవ్వింది!

నారదుడు "నారాయణ, నారాయణ" అంటూ అక్కణ్ణించి చల్లగా జారుకున్నాడు.

*(ఆంధ్రజ్యోతి, ఆదివారం, 29 అక్టోబరు 1989)*